అధికారులకు కనపడదు.. వినపడదు

- కొద్దిపాటి వర్షానికే ఆటోనగర్‌లో ముంపు సమస్య
- గత రెండు నెలల్లో మూడుసార్లు ముంపు
- పనులకు ఆటంకంతో మెకానిక్‌లకు ఇబ్బందులు
- శాశ్వత పరిష్కారం కోరుతున్నా పట్టించుకోని అధికారులు


సర్పవరం ఆటోనగర్‌లో ముంపు నీటిలో షెడ్లు


ముంపులోనే ఆటోనగర్ ప్రధాన రహదారి


ఏపీఐఐసీ జెడ్‌ఎంకు ఇటీవల సమస్యలు మొర పెట్టుకుంటున్న ఆటోనగర్ బాధితులు

కాకినాడ రూరల్: సర్పవరంలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడ ఆటోనగర్ కొద్దిపాటి వర్షానికే ముంపునకు గురవ్వడంతో ఎంఎస్‌ఎంఈ యూనిట్ల నిర్వాహకులు, అందులో పనిచేసే వర్కర్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రధాన రహదారితో పాటు మిగిలిన రోడ్లు సైతం రోజుల తరబడి ముంపులో ఉంటుండడంతో తిప్పలు తప్పడం లేదు. ప్రధానంగా మెకానిక్ వర్క్ చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న వర్కర్లు వీధిన పడుతున్నారు. తమను ముంపు సమస్య నుంచి గట్టెక్కించాలని వర్కర్లంతా మొత్తుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ముంపులోనే పారిశ్రామికవాడ

1996లో ఏపీఐఐసీ ద్వారా సర్పవరంలో 112 ఎకరాలను సేకరించి 350 ప్లాట్లతో పారిశ్రామికవాడగా అభివృద్ధి చేశారు. ఆటోగ్యారేజ్‌లు, మెకానిక్ షెడ్లతో పాటు ఐస్ ఫ్యాక్టరీలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు నెలకొల్పారు. సుమారు 125 వరకూ షెడ్లలో ఎక్కువ మంది మెకానిక్‌లపై ఆధారపడి బతుకున్నారు. ఆటోనగర్ వెనక పంట పొలాలు ఉండడంతో అక్కడి నీటితో పాటు, వర్షపు నీరు నిలిచిపోతుండడంతో తుఫాన్ల సమయంలో చెరువులను తలపిస్తోంది. ఏటా ఇదే సమస్య ఎదురవుతున్నా శాశ్వత పరిష్కారం మాత్రం చూపడం లేదు. ఈ ఏడాది అధిక వర్షాలకు రెండు నెలల వ్యవధిలో మూడు సార్లు ముంపునకు గురైందంటే అక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవొచ్చు. రోజులు తరబడి ముంపులోనే ఆటోనగర్ ఉండడంతో రెండు రోజుల క్రితం వర్కర్లంతా ఆందోళన బాట పట్టారు. దీనిపై స్పందించిన ఏపీఐఐసీ అధికారులు ఎప్పట్లానే వారితో కలిసి ముంపు ప్రాంతాలను సందర్శించి వెళ్లిపోయారు.

మరో అవుట్‌లెట్ అవసరం

లోతట్టు ప్రాంతంగా ఉన్న ఆటోనగర్ తుఫాన్లు, వరదల సమయంలో ముంపునకు గురవుతుంది. ఎగువ ప్రాంతంలోని పొలాల నీటితో పాటు ఆటోనగర్‌లోనూ నీరు నిలిచిపోతుంది. ముంపు నీరు పోయే మార్గాలు ఆక్రమణల కారణంగా చిక్కిపోయాయి. ఆక్రమణలు తొలగించి, ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉన్నా పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. ఐలా నిధులు రూ.80 లక్షలతో ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టారు. అయితే ముంపు కారణంగా రోడ్డు బాగా దెబ్బతింది. రోడ్లు ఎత్తు చేయడంతో పాటు మురుగు నీరు నిలిచిపోకుండా చూడాల్సిన అవసరముంది. అంతేకాకుండా ప్రస్తుతం ఉన్న అవుట్‌లెట్‌కు తోడు కొత్తగా మరో అవుట్‌లెట్ ఏర్పాటు చేయాల్సిన అవసరముందని నిపుణులు చెబుతున్నారు.

రెండు నెలల్లో సమస్య పరిష్కారానికి కృషి

ఆటోనగర్ ముంపు సమస్యను జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాం. రెండు నెలల్లో ముంపు సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. అవుట్‌లెట్ చిన్నదిగా ఉంది. వెడల్పు చేయడంతో పాటు మరో చోట ఏర్పాటుకు పరిశీలన చేశాం. ఇంజినీరింగ్ అధికారుల నివేదిక కోరాం.

– అబ్బిరెడ్డి రమణారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్

శాశ్వత పరిష్కారం చూపాలి

రోజుల తరబడి ఆటోనగర్ ముంపులో ఉండడంతో ఇబ్బంది పడుతున్నాం. పనులకు ఆటంకం కలుగుతుంది. చాలా మంది పనులు లేక జీవనోపాధి కోల్పోతున్నారు. ఆటోనగర్ అభివృద్ధిపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

– గరగ సత్తిబాబు, ఆటోనగర్ అండ్ ఇండస్ట్రియల్ పార్కు ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన జెడ్పీ సీఈఓ


కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్పీ సీఈవో లక్ష్మణరావు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారిగా నియమితులైన వానపల్లి వీరవెంకట సత్యలక్ష్మణరావు సోమవారం కలెక్టర్ షణ్మోహన్‌ను, జేసీ రాహుల్ మీనాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

కరప ఎస్‌ఐగా సునీత



కాకినాడ రూరల్: కరప పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా తోట సునీత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ టూ టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఆమె కరప వచ్చారు. ఇప్పటివరకూ ఎస్‌ఐగా పనిచేస్తున్న ఆర్‌వీఎస్ మూర్తి కరప స్టేషన్‌లోనే కొనసాగుతున్నారు.

ఉత్సాహంగా క్రీడాకారుల ఎంపికలు


ఎంపికల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగాల్లో సోమవారం జిల్లా క్రీడామైదానంలో జరిగిన ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా క్రీడాంశాల్లో జరిగిన ఎంపికలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 19 నియోజవర్గాలు, మన్యం జిల్లాల నుంచి క్రీడాకారులు సుమారు 4 వేల మంది వరకు హాజరయ్యారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఎంపికలను ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్‌ఐ పతాకాన్ని కాకినాడ జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు ఎస్‌జీఎఫ్‌ఐ ఆవిష్కరించారు.

విద్యార్థులకు బస్‌పాస్‌లు

బోట్‌క్లబ్: కాకినాడ నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులకు ఉచితంగా బస్ పాస్‌లు అందిస్తున్న లయన్స్ క్లబ్ సంకల్ప్ సేవలు ప్రశంసనీయమని క్లబ్ వైస్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్ అన్నారు. స్థానిక జగన్నాథపురం చర్చి స్క్వేర్ సెంటర్ వద్ద ఉన్న నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం బస్ పాస్‌లు అందజేశారు.

పరహితమే పరమ ధర్మం

కాకినాడ రూరల్: పర హితమే పరమ ధర్మమని ఇతరులకు సహాయం చేస్తే భగవంతుడు సంతోషిస్తాడని ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. సోమవారం రమణయ్యపేటలో ఉమా మనో వికాస్ కేంద్రం ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

విద్యార్థులకు కంప్యూటర్ ట్రైనింగ్

బాలాజీచెరువు: స్థానిక అభయం ఫౌండేషన్, పైడా చారిటీస్ ఆర్గనైజేషన్ 16 ఏళ్ల నుంచి నిర్వహిస్తున్న కంప్యూటర్ ట్రైనింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంఎస్ ఆఫీస్, టాలీ, సీ లాంగ్వేజ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను సోమవారం అందజేసి అభయం ఫౌండేషన్ కార్యాలయంలో అందజేశారు. సంస్థ చైర్మన్ పైడా వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఏఎస్‌ఈ గవర్నమెంట్ జూనియర్ బోటనీ అధ్యాపకురాలు సౌజన్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఆహ్లాదకర బోధనతో అద్భుత విజయాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపకులపతి మురళీకృష్ణ

బాలాజీచెరువు: ఆహ్లాదకర బోధనతో అద్భుత విజయాలు సాధించవచ్చని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ కాకినాడ ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ శాస్త్రసాంకేతిక మండలి, పాఠశాల విద్యాశాఖ, జేఎన్‌టీయూకే సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో సైన్స్ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం జరిగింది. సైన్స్ బోధనలో నూతన పోకడలు, ఆవిష్కరణలు అనే అంశంపై స్థానిక జేఎన్‌టీయూకే అల్యూమినీ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ఈ శిక్షణకు 340 మంది సైన్స్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సాంకేతిక అందించాలన్నారు. అప్‌కాస్ట్‌సభ్య కార్యదర్శి బీవీఏ కృష్ణమూర్తి, జిల్లా విద్యాశాఖధికారి పిల్లి రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ మాట్లాడుతూ ఈ శిక్షణ చాలా వినూత్నమైందన్నారు.

వలంటీర్లను కొనసాగించాలంటూ ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వలంటీర్లు

కాకినాడ సిటీ: రాష్ట్రవ్యాప్తంగా 1.30 లక్షల మంది వలంటీర్లను కొనసాగించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వలంటీర్లందరినీ కొనసాగిస్తామని, రూ.10 వేలు వేతనంగా ఇస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో 1,30,000 మంది వలంటీర్లు రోడ్డు మీదకు వచ్చి పోరాడడం మినహా మరో దారి లేదన్నారు. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్న పరిస్థితుల్లో వలంటీర్లు ఉద్యోగమే ప్రధాన ఆదాయ వనరుగా కుటుంబాన్ని పోషించుకుంటున్నామన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పని చేసినా ఉద్యోగ భద్రత లేకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. ఆందోళనలో ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల యూనియన్ నాయకులు డి.రమేష్, ఎన్.నాగలక్ష్మి, సంతోషిణి, వరుణ్, సీఐటీయూ నాయకులు మలకా రమణ, మేడిశెట్టి వెంకటరమణ, బి.కుమారి, కె.దుర్గాదేవి, వరలక్ష్మి, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ కమాండెంట్‌కు పదవీ విరమణ వీడ్కోలు


సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న పిట్టా శామ్యూల్‌జాన్

కాకినాడ రూరల్: ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్(ఎఫ్‌ఏసీ)గా పనిచేస్తూ సోమవారం పదవీ విరమణ పొందిన పిట్టా శామ్యూల్ జాన్‌కు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఏపీఎస్పీ క్యాంప్ వద్ద అడిషనల్ ఎస్పీ ఎల్.అర్జున్ నేతృత్వంలో సిబ్బంది కవాతు నిర్వహించారు. సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం శామ్యూల్ జాన్ మాట్లాడుతూ తాను ఇదే బెటాలియన్‌లో పుట్టి పెరిగి ఇదే బెటాలియన్‌లో కమాండెంట్‌గా పదవీ విరమణ పొందడం ఆనందంగా ఉందన్నారు. తన తండ్రి డేవిడ్ పీసీ నంబరు 482 ఇదే బెటాలియన్‌లో పనిచేసి పదవీ విరమణ పొందరన్నారు. ఇటువంటి అవకాశం కల్పించిన డీజీపీ, బెటాలియన్స్ ఐజీ, డీఐజీలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు సాంబయ్య, మురళీకుమార్, సిబ్బంది, ఏపీఎస్పీ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారి చదువుకు ఆర్థిక సాయం


చిన్నారికి ఆర్థిక సాయం అందిస్తున్న సతీష్, వెంకటలక్ష్మి


కాకినాడ క్రైం: తండ్రిని కోల్పోయిన ఓ చిన్నారి చదువుకు శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ సహకారం అందించింది. కాకినాడ డ్రైవర్స్ కాలనీకి చెందిన అప్పారావు గత మే నెలలో గుండెపోటుతో మరణించాడు. కుటుంబం ఆర్థిక కష్టాల్లో చిక్కుకుంది. దీంతో కుమార్తె చదువు తల్లికి భారంగా మారింది. ఈ నేపథ్యంలో తల్లి శ్రీ యువసేన వ్యవస్థాపకుడు బొల్లం సతీష్‌ని కలసి తన వేదనను చెప్పుకుంది. దీంతో చిన్నారి చదువుకు సంస్థ నుంచి సతీష్ ఆర్థిక సాయం అందించారు. కత్తిపూడికి చెందిన యర్రంశెట్టి వెంకటలక్ష్మి తన కుమారుడి జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని శ్రీ యువసేన స్వచ్ఛంద సంస్థ ద్వారా చిన్నారికి అందించారని సతీష్ తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు


సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

బోట్‌క్లబ్: శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆలయ కమిటీ, ఈఓలకు సూచించారు. స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయంలో సోమవారం ఉత్సవ ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో సాధారణ భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే ట్రాఫిక్ ఆటంకాలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆలయ కోనేరులో ఉన్న నీరు కలుషితంగా ఉందని దాన్ని మార్పు చేయాలని అధికారులకు సూచించారు. భక్తులు అందించే నగదు, కానుకలతో తిరిగి ఆలయ అభివృద్ధికి, భక్తులకు వినియోగించాలని సూచించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి నారాయణరావు (బాబ్జి) మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ కాకినాడ నగరంలోని బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్ర వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే అన్నదానానికి ఒక అజ్ఞాత భక్తురాలు రూ.1,00,116 అందించినట్లు చెప్పారు. సమావేశంలో దేవాదాయశాఖ ఆర్‌జేసీ సుబ్బారావు, ఈవో ఉండవల్లి వీర్రాజుచౌదరి, ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వారిని పార్టీల నుంచి సస్పెండ్ చేయాలి


దళితుల ఆత్మ గౌరవదీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), పశ్చిమగోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజులను ఆయా పార్టీల నుంచి సస్పెన్షన్ చేయాలంటూ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మాలమహానాడు కాకినాడ జిల్లా జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద దళితుల ఆత్మగౌరవ దీక్షను చేపట్టిన సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఈనెల 21న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) తన అనుచరులతో వచ్చి కాకినాడ రంగరాయ వైద్య కళాశాల స్పోర్ట్స్ వైస్ చైర్మన్ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ పి.ఉమామహేశ్వరరావుతో పాటు కొందరు జూనియర్ డాక్టర్లపై దౌర్జన్యం చేశారన్నారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం ఏలూరుపాడులో దళితులు ఏర్పాటు చేసుకున్న అంబేడ్కర్ ఫ్లెక్సీని స్వయంగా పెకిలించి అవమానించిన స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజును తెలుగుదేశం పార్టీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర డాక్టర్ల సంఘ అధ్యక్షుడు డాక్టర్ జయధీర్ సంఘీభావం తెలుపుతూ దీక్షలో పాల్గొన్నారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మాలమహానాడు కాకినాడ జిల్లా జేఏసీ అధ్యక్షులు పండు అశోక్, ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్, ఉపాధ్యక్షులు ఏనుగుపల్లి కృష్ణ, మూలే మేఘరాజు, పిల్లి శివకుమార్, బీఎస్పీ జిల్లా ఇన్‌ఛార్జి మాతా సుబ్రహ్మణ్యం, మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షులు పెయ్యల పరశురాముడు పాల్గొన్నారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి


ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ప్రజల సమస్యలను వింటున్న కమిషనర్ భావన

కాకినాడ సిటీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ప్రతి ఒక్క సమస్యనూ సత్వరమే పరిష్కరించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని, అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాల్లో ఆమె పాల్గొని ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, టౌన్ ప్లానింగ్, యూపీఏ విభాగాలకు సంబంధించి పలువురు ఫోన్ ద్వారా సమస్యలు వివరించారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ భావన అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో నేరుగా ప్రజల నుంచి కమిషనర్ భావన వినతులు స్వీకరించారు. డయల్ యువర్ కమిషనర్‌కు సుమారు 19 మంది వివిధ సమస్యలపై ఫోన్లు చేశారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో వివిధ సమస్యలపై 25 అర్జీలు కమిషనర్‌కు అందాయి. వీటిలో ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్, టౌన్ ప్లానింగ్, యూపీఏ, రెవెన్యూ విభాగానికి సంబంధించిన వినతులు ప్రజల నుంచి అందాయి. వాటిని స్వయంగా తీసుకొని వాటి పరిష్కారానికి సంబంధిత విభాగాల అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎస్‌ఈ సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్‌ఈ వెంకట్రావు, ఈఈ మాధవి, మేనేజర్ సత్యనారాయణ, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, డీసీపీ హరిదాసు, టీపీఆర్వో శైలజ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు లేనట్టే!

- అక్టోబర్ నుంచి ఇస్తామని గతంలో చెప్పిన కూటమి ప్రభుత్వం
- నేటికీ తెరుచుకోని వెబ్‌సైట్
- కార్యాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు

కాకినాడ సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయ్యింది. ఇంత వరకు కొత్త పింఛన్ల పంపిణీపై కార్యాచరణ రూపొందించ లేదు. అక్టోబర్ నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వ పెద్దలు ఆర్భాటంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో రాజకీయాలు, పార్టీలకు సంబంధాలు లేకుండా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే కొత్త పింఛన్లు మంజూరయ్యేవి. కూటమి ప్రభుత్వం పింఛన్ల మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఎదురు చూపులు తప్పడం లేదు. కొత్తగా ఒక్కరికి కూడా పింఛను ఇవ్వలేదు కానీ ఇది మంచి ప్రభుత్వం అంటూ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తుండడంతో ఇదెక్కడి విడ్డూరం అంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు.

అర్హత ఉన్నా ఎదురు చూపులే..

అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు, కొత్త పింఛన్ల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రతి గ్రీవెన్స్‌కు ఇటు కలెక్టరేట్, ఆర్డీవో, సచివాలయాలకు తిరుగుతున్నారు. ప్రభుత్వం నూతన పింఛన్ల కోసం ఎలాంటి వెబ్‌సైట్ తెరవకపోవడంతో అర్హులు నిరాశతో వెనుతిరగాల్సి వస్తోంది. కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో ఇంకా ప్రభుత్వం నుంచి సమాచారం లేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్లు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛన్లు, కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే వలంటీర్ల సహాయంతో లబ్ధిదారులకు అందజేసేవారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగింది. కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం పింఛన్లు, రేషన్ కార్డుల వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది. దీంతో కొత్తగా పింఛను, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని భావించిన వారు సచివాలయాల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నారు.

పింఛన్లు తొలగిస్తామంటూ బెదిరింపులు

పింఛన్లు తొలగించాలంటూ ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి ఉత్తర్వులు రానప్పటికీ జిల్లాలోని కొన్ని మండలాల్లో కూటమి నాయకులు పింఛన్లు తొలగించేందుకు పింఛన్‌దారులను బెదిరింపులకు దిగుతున్నారని కొందరు వాపోతున్నారు. పింఛన్‌దారులకు మీరు అనర్హులు మీకు వచ్చే నెల నుంచి పింఛన్ నిలిపివేస్తామంటూ బెదిరిస్తున్నారంటున్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై చర్యలు చేపట్టండి

కాకినాడ సిటీ: గ్రావెల్ అక్రమ తవ్వకాలపై చర్యలు చేపట్టాలని బీసీ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాసంశెట్టి రాజేశ్వరరావు, దళిత నాయకుడు సవరపు నాగరాజు అన్నారు. ఈ మేరకు జేసీ రాహుల్ మీనాకు సోమవారం వినతి పత్రం అందజేశారు. కాకినాడ జిల్లాలోని పెద్దాపురం, గండేపల్లి మండలాలలో ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు వీటికి సహకరిస్తున్నారని ఆరోపించారు. పెద్దాపురం మండలం ఆనూరు మెట్ట, రామేశ్వరం, గండేపల్లి మండలం సూరంపాలెంలోని గుల్లమెట్టపై అక్రమంగా గ్రావెల్ త్రవ్వకాలు చేస్తున్నారని చెప్పారు. కొందరు వ్యక్తులు ఎన్‌హెచ్ 5 రోడ్డు పేరు మీదుగా అనుమతి తీసుకున్నామని చెప్పి అనుమతి లేకుండా త్రవ్వకాలు సాగిస్తున్నారన్నారు. ఆర్వీఎస్‌ఎల్ వారి హరిహర సప్లయర్స్ ముసుగులో రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై ముఠాగా ఏర్పడి విపరీతమైన ధరలు పెంచారన్నారు. ఒకే సర్వే నంబర్ మీద అనుమతి తీసుకుని పక్కనున్న సర్వే నంబర్లలో దాదాపు 9 జేసీబీలతో రోజుకు 500 లారీలు మట్టిని అక్రమంగా రియల్ ఎస్టేట వ్యాపారులకు అమ్ముకొని రైతులను, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆందోళన


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

కాకినాడ సిటీ: కాంట్రాక్టు ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికులు, నాన్ పర్మినెంట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పర్మినెంట్ ఉద్యోగులకు ఇచ్చే అన్ని సదుపాయాలు కల్పించాలని 2013లో ఇచ్చిన తీర్పును రాష్ట్రంలో ఏ డిపార్టుమెంట్‌లోనూ అమలు చేయడం లేదన్నారు. చట్టాలను అమలు చేయాల్సిన ప్రభుత్వాలే ఉద్యోగుల శ్రమను దోచుకోవడం అన్యాయమన్నారు. ఈ ఆందోళన దేశవ్యాప్తంగా 660 జిల్లాల్లో జరుగుతుందన్నారు. తాము కనీస వేతనం రూ.26 వేలు మాత్రమే అడుగుతున్నామన్నారు. 240 రోజుల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రతి కాంట్రాక్టు ఉద్యోగిని, కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబీ, 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాట్ల రాంబాబు, అర్బన్ హెల్త్ సెంటర్ల ఉద్యోగుల సంఘం నాయకులు గెద్దాడ సత్యనారాయణ, సెకండ్ ఏఎన్ఎం సంఘం జిల్లా అధ్యక్షురాలు సూర్యకుమారి, పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జేసీ రాహుల్ మీనాకు వినతి పత్రం అందించారు.

పోలీసులకు సత్కారం


బహుమతి ఇచ్చి అభినందనలు తెలుపుతున్న ఎస్పీ

కాకినాడ క్రైం: సోమవారంతో ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు పోలీసులను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఘనంగా సత్కరించారు. కాకినాడలోని ఎస్పీ కార్యాలయంలో ఏఆర్‌ఎస్‌ఐ ఇల్లూరి వెంకట రమణ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ చింతపల్లి వెంకటేశ్వరరావు సత్కారాలు పొందిన వారిలో ఉన్నారు. యావత్ సేవలన్నీ నిబద్ధతతో పూర్తి చేసిన ఇరువురినీ ఎస్పీ అభినందించారు. విరమణ అనంతరం అందాల్సిన ప్రయోజనాలను తక్షణమే అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు.

పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన

కాకినాడ సిటీ: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం కాకినాడ నగరంలోని అన్ని డివిజన్లలోని వార్డు సచివాలయాల్లో ప్రజలకు పారిశుద్ధ్య నిర్వహణపై మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఇంటింటా తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఎలా భద్రపరచాలి? ఆరు బయట చెత్త వేయడం వల్ల కలిగే నష్టాలు తదితర విషయాలపై పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరించారు. వీధుల్లో వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. చెత్తను సంచుల్లో భద్రపరచుకోవడం వంటి విషయాలను వివరించారు. తక్కువ మైక్రాన్లు కలిగిన పాలిథీన్ సంచుల వినియోగాన్ని కూడా నిలిపివేయాలని సూచించారు. కార్యక్రమాల్లో వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొని ఇంటింటికీ వెళ్లి సూచనలు అందజేశారు.

అండర్-19 ఖోఖో ఎంపికల వేదిక మార్పు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో అండర్-19 విభాగంలో మంగళవారం డీఎస్‌ఏలో జరగాల్సిన ఖోఖో ఎంపికల వేదిక కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మార్పు చేసినట్లు సమాఖ్య కార్యదర్శి శివరామకృష్ణ సోమవారం తెలిపారు. ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆఫీస్ వద్ద రిపోర్టు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9848176986 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పోలీస్ స్పందనకు 82 ఫిర్యాదులు


ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చినవారు వారి సమస్యలను నేరుగా ఎస్పీకి విన్నవించారు. సోమవారం నాటి స్పందన కార్యక్రమంలో మొత్తం 82 ఫిర్యాదులు అందాయని ఎస్పీ తెలిపారు.

నేడు పింఛన్ల పంపిణీ

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లాలో ఈనెల ఒకటిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను 2 లక్షల 75 వేల 679 మందికి రూ.116.03 కోట్ల పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ పెన్షన్ల పంపిణీ మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించాలన్నారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులు శ్రద్ధ వహించి ప్రతి గంటకు మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా, మండల స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు పాల్గొన్నారు.